# దృశ్యమూ - అదృశ్యమూ

ఉన్నపళంగా మెలకువ వచ్చింది నాకు. ఎందుకొచ్చిందో తెలియదు. ఈ మధ్య అప్పుడప్పుడూ ఇలా జరుగుతూ ఉంటుంది. దేని కారణం దానికి ఉంటుంది. కారణం వెదకాలంటే నాకు భయం. ఆ భయమూ ఇటీవలనే!

కళ్ళు తెరుచుకున్నానన్న మాటేగాని ఏదీ స్పష్టంగా కనిపించటం లేదు. గదంతా మసక చీకటి. ఇప్పుడు 'టైము' ఎంతయి ఉంటుంది? అంచనా వేసుకున్నాను. సాధారణంగా నా అంచనా తప్పు కాదు. బహుశా రెండు గంటలు దాటుతూ ఉండొచ్చు. మంచం పక్కనే ఉన్న కిటికీ గుండా ఆకాశం కేసి చూస్తే దశమి చంద్రుడు కొబ్బరి చెట్ల కొమ్మల మధ్య కదులుతూ చారలు చారలుగా కనిపిస్తున్నాడు.

ఇంకా తెల్లవారటానికి నాలుగు గంటలు పడుతుందేమో! నాలుగు గంటలసేపే! ఈ మధ్యలో మళ్ళీ ఒక చిన్నకునుకు పడితే ఫరవాలేదు. లేకపోతే తెల్లారేదాకా ఒంటరిగా నా గదిలో – నాగది లోపల చీకటిలో... చీకటి లోపల నా గదిలో... శ్రీశ్రీ గుర్తుకొచ్చాడు... మెల్లగా మంచం మీద అటూ ఇటూ కదిలాను. బాత్‌రూమ్‌కు వెళ్ళాలనిపించింది. ఎప్పుడు మెలకువ వచ్చినా బాత్‌రూమ్ వెళ్ళి రావాల్సిందే! ఇదో అలవాటయిపోయింది.

నెమ్మదిగా లేచి కూచున్నాను. అప్పటికి కళ్ళకు చీకటి బాగా అలవాటయిపోయింది. గదంతా స్పష్టంగా కన్పిస్తోంది. నా ఎదురుగా ఉన్న అల్మారాలో పుస్తకాల బారులు – మంచం పక్కగా ఉన్న టేబుల్ మీద పుస్తకాల దొంతరలు... రాత్రి పదింటి వరకూ చదివి, బోర్లా పరచిన రావిశాస్త్రి "నాలుగు ఆర్లు" కథల సంపుటి! నిన్ననే కొన్నాను ఆ పుస్తకం. తలెత్తి చూస్తే గది చూరు బండల మీద పుస్తకాలు నింపిన పెద్ద అట్టపెట్టెలు! పుస్తకాలు... పుస్తకాలు.. పుస్తకాలు! "ఇల్లంతా ఎక్కడ చూసినా నీ పుస్తకాలే!" ఎవరిదీ గొంతు! శారద గొంతు ఇది. ఆ మాట విని, వినీ, నా గొంతులో కూడా శారద కూచున్నట్లే అయి, "పుస్తకాలు... ఎక్కడ చూసినా పుస్తకాలే..." అని నేను కూడా గొణుక్కోవడం అలవాటయి పోయింది.

నెమ్మదిగా లేచి స్విచ్‌బోర్డ్ దాకా నడిచి 'లైట్' వెలిగించాను. గదంతా ఒక్కసారిగా తెల్లటి వెలుగు. కళ్ళమీద సుతిమెత్తని ఒత్తిడి, బాధల బరువులాగా! కళ్ళునులుముకొని గోడ గడియారం కేసి చూశాను. నా అంచనా తప్పుకాలేదు. రెండు గంటలా పది నిమిషాలు. మెత్తగా అడుగులు వేస్తూ హాల్లోకి వచ్చాను. బాత్‌రూమ్ వెళ్ళాలంటే హాలు దాటుకొనే వెళ్ళాలి.

హాల్లో ఓ మూల మంచం మీద శారద పడుకోనుంది, ఓ వైపు ఒత్తిగిలి! శారద ఎంత చక్కగా నిద్రపోతుంది, ఈ లోకం తనది కానట్లుగా! శారద నిద్ర చూస్తే నాకెప్పుడూ అసూయే! "ఏం నిద్రే నీది!" అంటే "నాలాగే రోజంతా నువ్వు పనిచెయ్! నిద్ర గాఢంగా ఎందుకు పట్టదు" అంటుంది చిరుకోపంతో! నిజమే! శారదకు ఉదయం లేచినప్పట్నుంచీ పనే! శారదకు పనే జీవితం! జీవితమే పని! శారద పని చూస్తే అబ్బూరి ఛాయాదేవి 'సుఖాంతం' కథ ఎప్పుడూ గుర్తు వస్తుంటుంది నాకు!

హాల్లో నేల మీద చాపలపై సరోజా, సరితా నిద్రపోతున్నారు. సరిత మూడంకె వేసుకొని పడుకుంటుందెప్పుడూ! తెల్లవారినా లేవదది. అందుకే ఎవరికీ అడ్డు లేకుండా, ముందే జాగ్రత్తగా ఓ మూల తన పడక వేసుకుంటుంది... "పగలంతా కాలేజీ! రాత్రిపది దాకా చదువు. నేను లేచేదాకా నన్నెవరూనిద్ర లేపకండి" అంటుందా పిల్ల. ఏ పని చెప్పినా, "పెళ్ళయేదాకా నేను సుఖపడాలనుకున్నాను. నాకెవరూ పనీపాటా చెప్పకండి" అంటుంది. పెద్ద ఆరిందాలా! తీరా దాని వయసు పదహారేళ్ళే. పెళ్ళికీ కష్టాలకూ లంకె ఉన్నట్లుగా అప్పుడే గ్రహించిందానిలా ఉంటాయి దాని మాటలు! పెద్దమ్మాయి సరోజ తల్లితో పాటే నిద్ర లేస్తుంది. సరోజ బి.ఏ. పూర్తి చేసి రెండేళ్ళయింది. "ఇరవై రెండు దాటింది పెద్దదానికి –పెళ్ళి సంబంధం చూడండి" అంటూ రోజుకు నాలుగైదు సార్లయినా గోల పెడుతూ ఉంటుంది శారద. ఆ మాట విన్నప్పుడల్లా నా శరీరం భూమిలోకి అణగదొక్కినట్లవుతూ ఉంటుంది... కృష్ణ ఊళ్ళో లేడు. ఏదో ఇంటర్వ్యూ అంటూ హైదరాబాద్ వెళ్ళి రెండు రోజులయింది. వాడు ఎం.ఏ. పూర్తి చేసి రెండేళ్ళయింది. ఎన్ని ఇంటర్వ్యూలో, ఎన్ని అప్లికేషన్‌లో! ఎన్ని ఖర్చులో!

బాత్‌రూమ్‌కెళ్ళి, తిరిగి నా గదికి చేరుకున్నాను. లైట్ ఆర్పేసి మంచం మీద నడుము వాల్చాను. సడన్‌గా రేపటి ప్రయాణం గుర్తుకొచ్చింది.

రేపు ఉదయం నరసింహంతో కలిసి, హిందూపురం వెళ్ళిరావాలి. అక్కడో సంబంధం ఉంది. చూసి రావాలి. ఆ సంబంధం వాకబు చేసినవాడు నరసింహమే! రేపు తామిద్దరూ వస్తున్నట్లు వారం క్రితం ఉత్తరం రాశాడు. తప్పక వెళ్ళాలి. అబ్బాయి బ్యాంక్‌లో పనిచేస్తున్నాడట. మన స్థాయికి తగ్గ సంబంధమే అన్నాడు. ఇప్పటికి నాలుగు సంబంధాలు తప్పి పోయాయి. దాదాపు అన్నీ కట్నం దగ్గరే బెడిసికొట్టాయి. ఒక సంబంధం మాత్రం అమ్మాయికి ఉద్యోగం లేదనే సాకుతో తప్పిపోయింది. ఉద్యోగం ఉంటే మాత్రం కట్నం అడగరా ఏమిటి? ఏ సంబంధం చూసినా లక్షల్లోనే! తన తాహతు వేలల్లో వుంది! యాభై వేలు ఇచ్చి కొంత బంగారం పెట్టగలడు తను! హిందూపురం సంబంధం కుదరవచ్చు అంటున్నాడు నరసింహం.

తెల్లవారటానికి ఇంకో నాలుగు గంటలుంది. అంతలోగా ఒక నిద్ర తీయాలి. లేకపోతే పగలంతా బావుండదు – బలవంతంగా కళ్ళు మూసుకొని, ఆలోచనలు పక్కకు పెట్టి నిద్రను కప్పుకోటానికి ప్రయత్నిస్తున్నాను...

'లేవండి' అన్న కుదుపుతో ఎక్కడో ఆకాశం నుంచి దబ్బున పడ్డట్లు మెలకువ వచ్చింది నాకు – శారద మంచం పక్కన నిల్చొని "రోజూ అందరికంటె ముందు లేచేవారు! ఈ రోజు ప్రయాణం పెట్టుకొని యింకా ఈ నిద్ర ఏమిటండీ! లేవండి – ఆరున్నరయింది" అంటోంది, విసురుగా!

"ఔనౌను" అనుకుంటూ లేచి హాల్లోకి వచ్చాను. సరిత ఓ మూల ఇంకా మూడంకెలోనే ఉంది. సరోజ అప్పటికే స్నానం చేసి వెంట్రుకలార్చుకుంటూ దినపత్రిక చూస్తూ ఉంది.

గబగబా పళ్ళు తోముకొని, స్నానం చేసి, బట్టలు మార్చుకొని, హాల్లో కుర్చీలో కూచున్నాను. అప్పటికి ఏడున్నర దాటింది. శారద నా చేతికి ఇడ్లీల ప్లేటు అందిస్తూ "నరసింహంగారు మీ కోసం ఎదురుచూస్తూ ఉంటారు... ఆయన ఇంటికి వెళ్ళి నేరుగా స్టాండ్‌కు బయలుదేరండి. దారిలో ఏదైనా పుస్తకాల షాపు కనిపిస్తే అందులో దూరకండి. పదకొండులోగా హిందూపురం చేరుకోండి. మళ్ళీ వర్జ్యం వస్తుంది" అంది. వర్జ్యాలూ, రాహుకాలాలూ, యమగండాలూ మనిషి జీవితాన్ని శాసించే శక్తులు కాదని నేను ఈ పాతికేళ్ళలో శారదకు నచ్చచెప్పలేక పోయాను – తలూపుతూ టిఫిన్, కాఫీ ముగించి కండువా భుజం మీద వేసుకొని ఇంటి నుంచి బయలుదేరాను.

నరసింహం ఇల్లు కాస్త దూరమే. అయినా తొందరగా నడిస్తే పదిహేను నిమిషాల్లో చేరుకోవచ్చు–నరసింహం నాకంటే రెండేళ్ళు చిన్నవాడే అయినా, చాలా విషయాల్లో పెద్దవాడనే భావం నాకు కలుగుతూ ఉంటుంది. చిన్న ఉద్యోగంతో, కొద్దిపాటి జీతంతో ఇప్పుడెంత వాడయ్యాడు? ముగ్గురమ్మాయిలూ, ఇద్దరబ్బాయిలూ నరసింహానికి. ఇద్దరమ్మాయిల పెళ్ళిళ్ళు చేశాడు. ఒకమ్మాయిని డాక్టర్ కిచ్చాడు. ఒకమ్మాయిని లాయర్‌కిచ్చాడు. కట్నాలూ, కానుకలూ, మాబోటి వాళ్లు ఆశ్చర్యపోయేలా ఇచ్చాడు. ఒకబ్బాయిని కర్ణాటకలో డొనేషన్ కట్టి ఇంజనీరింగ్ చదివిస్తున్నాడు. ఇంకో అబ్బాయిని మెడిసిన్ కోచింగ్ కోసం నెల్లూరు పంపించాడు. ఇదంతా నాకు అద్భుతంగా, మాయగా అనిపిస్తుంది. పదేళ్ళ క్రితం వరకూ ఏమీ లేనివాడు. పదేళ్ళ క్రితం ఊళ్ళో తన భాగానికొచ్చిన భూమిని యాభై వేలకు అమ్మేశాడు. ఆ డబ్బుతో ఒక కార్పొరేషన్‌లో భాగస్వామి అయ్యాడు. దానిమీద వచ్చే లాభాలతో ప్లాట్లు కొనేవాడు. ధర పలుకగానే దాన్ని అమ్మేసేవాడు. ఆ నగదును, మళ్లీ పెట్టుబడిగా మార్చేవాడు. సొంతంగా ఇళ్ళు కట్టించి అమ్మేవాడు. ఏవేవో షేర్లు కొనేవాడు. లాభాలు తీసేవాడు. క్షణం తీరిక లేకుండా తిరిగేవాడు. ఎవరెవరికో పనులు చేసి పెట్టేవాడు. తన పనులు చేయించుకొనేవాడు. ఈ పదేళ్ళలోనే పాతిక లక్షల ఆస్తి సంపాదించాడంటే ఇంతకంటే ఇంద్రజాలం ఇంకేముంటుంది? బహుశా ఇదంతా నరసింహం ఆడపిల్లల తండ్రికావడం వల్లనే జరిగిందేమో అని నాకనిపిస్తూ ఉంటుంది. ఆడపిల్లల తండ్రుల్ని, సంపాదన పరులుగా కమ్మని, ఈ సమాజం శాసిస్తున్నదేమో? ఇది విషాదమా? వీరత్వమా? నేను తేల్చుకోలేక పోతున్నాను. ఒక అద్భుత దృశ్యంలా, ఒక వీరరసోచిత కావ్యంలా కన్పిస్తాడు నాకు నరసింహం!

"నీ సాహిత్యమూ, పుస్తకాలూ నీ సమస్యల్ని పరిష్కరించవు మూర్తీ! ఇంకా ఎప్పుడు సంపాదించాలనుకున్నావ్ నువ్వు, ఇంట్లో ఇద్దరు ఆడపిల్లల్ని పెట్టుకొని" అని అప్పుడప్పుడు నాకు చురక తగిలిస్తుంటాడు అతను!

శారదైతే, ఎప్పుడూ నరసింహాన్ని పోలిక పెట్టి నన్ను దెప్పుతూ ఉంటుంది. "మీరూ ఉన్నారు; ఒక్క పైసా నేర్పుగా మిగిలించే జ్ఞానం లేదు. ఎవరొచ్చి అడిగినా సేవింగ్స్ లోంచి తీసి చేబదుళ్ళు ఇవ్వడమే! రెండు రాళ్ళు మిగిలితే చాలు, నాలుగు పుస్తకాలు కొనటమే! ఇలా అయితే మనం ఎలా బాగుపడేట్టు" అంటూ దీర్ఘాలు తీసేది. నరసింహం సమర్థత, ఎన్నేళ్ళు కష్టపడితే మాత్రం నాకెలా వస్తుంది? అయినా నాకు బాధ ఉండదు! ఇది మరీ ఆశ్చర్యం!!

పది నిమిషాల్లో నరసింహం ఇంటికి చేరుకున్నాను. నరసింహం అప్పటికే సిద్ధంగా ఉన్నాడు. 'ఆటో' ఎక్కి 'స్టాండ్' చేరుకునేసరికి బస్సు కూడా సిద్ధంగా ఉంది.

బస్సులో ప్రయాణం చేస్తున్నాము... అరగంట గడిచేసరికి, విశాలమైన మైదానంలో, జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకున్న నరసింహంలా, వేగంగా వెళ్తోంది బస్సు – రోడ్డుకు రెండు వైపులా ఎండిపోతున్న వేరుశనగ పొలాలు – రెండు నెలలుగా వర్షాలు లేక వేరుశనగపైరు ఎండిపోయి, భూమికి అతుక్కుపోయి, మరణ శయ్య మీద ఉన్న రోగిలా విలవిలాడుతోంది. విత్తనం వేసిన తర్వాత ఒక్క వర్షం వచ్చిందో ఏమో!! ఆ తర్వాత వర్షాలే లేవు. పూత పూసి ఊడలు దిగి, ఫలదీకరణ జరిగే మంచి తరుణంలో వర్షం ఎగనామం పెట్టింది.. రేపో మాపో వర్షం వచ్చినా ఈ పైరు బతకదింక. ప్రతి రెండు మూడేళ్ళకూ ఈ ప్రాంతంలో ఈ కరువు పునరావృతమౌతూనే ఉంది. కొన్ని ఏళ్ళుగా, కొన్ని తరాలుగా ఈ గడ్డ జీవితం ఇలాగే ఉంటూ ఉంది. మాకు చెరువులు నిండే వర్షాలు వద్దు. నదులు పొంగే వర్షాలు వద్దు. వంకలూ వాగులూ పారే వర్షాలు వద్దు. రోడ్డు పక్కల ఉండే గుంటలూ, గోతులూ నిండే వర్షాలు చాలు! బతికిపోతాము. అయినా ఆ కరుణకుకూడా నోచుకోవటం లేదు మా గడ్డ! తలచుకొనే కొద్దీ శరీరంలో ప్రకంపనలు.. మా ఊళ్ళో పరిస్థితి ఇంకెంత ఘోరంగా ఉందో!! నెల క్రితం ఊరికి వెళ్ళొచ్చాను పొలం చూసి వద్దామని. నాకు పదెకరాల మెట్ట ఉందక్కడ – ఏనాడూ దాని ఫలసాయం నేను సరిగ్గా పొందింది లేదు. ఒక సంవత్సరం కొంత పంట చేతికి వస్తే, మరుసటి సంవత్సరం పెట్టుబడి కింద అది ఇంకిపోతూ ఉంటుంది. అంతో ఇంతో జీతం సంపాదిస్తున్న నా పరిస్థితే ఇలా ఉంది. ఎదిగిన ఒక బిడ్డకు పెళ్ళి చేయడానికే సాధ్యం కాని స్థితి. వర్షి భూమి మీదే ఆధారపడే సన్నపాటి రైతు ఎంత ఘోరం!... ఇక పెళ్ళిళ్ళు, ఉత్త ఊహల్తో ముడిపడాల్సిందే!

మేము చూడబోయే ఈ కొత్త సంబంధమైనా కుదురుతుందా? ఇంత దారుణమైన కరువు రాజ్యమేలే ఇక్కడ కూడా కట్నాలు మాత్రం ఎండిపోక పోవడం చాలా ఆశ్చర్యమనిపిస్తుంది నాకు – ఇంత కరువులోనూ, మనుషులు, మనుషుల ధరలు పెంచడం ఎంత విషాదం! ఎండిపోతున్న గోమాత పొదుగు నుండీ చుక్క చుక్కా, చివరి బిందువు వరకూ పాలు పిండుతున్నట్లు కట్నం పిండుతూనే వున్నారంటే ఎంత హింస! అయినా ఈ హింసను అనుభవించడానికే, అంగీకరించే మానసిక సర్దుబాటు.

నేనొక అయోమయమైన మానసిక స్థితిలో చాలాసేపు కూరుకుపోయాను. నా పక్కనే కూర్చున్న నరసింహం దినపత్రికను తిరగవేస్తూ నింపాదిగా వక్కపొడి నముల్తున్నాడు. నరసింహంకు కష్టాలు లేవు. నరసింహంలా కష్టాల నుంచి బయటపడే నేర్పు ఎందరు సాధించ గలుగుతారు? ముందు ముందు నరసింహాలు మాత్రమే ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయగలుగుతారేమో! నరసింహాల సుఖాల వెనక కూడా ఎందరి జీవితాలు బలియై ఉంటాయో! అది నరసింహులకు కూడా తెలియదేమో! నాలో నేనే నిర్లిప్తంగా నవ్వుకున్నాను.

మూడు గంటలు ప్రయాణం చేసి గమ్యం చేరుకున్నాము. బస్సు దిగి రిక్షాలో వియ్యంకుల ఇల్లు చేరుకొనేసరికి పదకొండున్నర అయింది. అక్కడ మా కోసం ఎవ్వరూ ఎదురు చూస్తున్న జాడ కనిపించలేదు. ఆడపిల్లల తండ్రులైతేనే గదా ఎదురు తెన్నులు చూసేది!

మేము వెళ్ళిన పది నిమిషాలకు ఇంటి యజమాని బజారు నుంచీ వచ్చాడు. ఆయన వెంట మరో పెద్దమనిషి కూడా ఉన్నాడు. ఆ వచ్చిన పెద్దమనిషి నా వివరాలన్నీ ఆరా తీశాడు. బంధుత్వాలన్నింటినీ తిరగదోడాడు. మా అమ్మాయి చదువూ వయసూ అడిగాడు. మా ఊరూ, నా ఆస్తిపాస్తులూ, ఉద్యోగమూ, ఆదాయమూ, ఒక చిన్న ఇంటర్వ్యూలా నేర్పుగా చేశాడు. చాలా వాటికి నా బదులుగా నరసింహమే చెప్పుకొచ్చాడు. ఈలోగా ఆఫీస్ నుంచీ వాళ్ళబ్బాయి వస్తే మాట మాత్రంగా పరిచయాలు చేశారు. అబ్బాయి బాగానే ఉన్నాడు. తాను పెళ్ళి కావాల్సిన మగాడిని అన్న స్పృహలో ఉన్నట్టున్నాడు. ఆ అబ్బాయికి ఇదివరకు వచ్చిన సంబంధాల గురించి ఆ పెద్దమనిషి ఒక లిస్టు చదివాడు. ఫలానా ఊరువాళ్ళు ఒక లక్ష నగదూ, ఇరవై తులాల బంగారమూ, ఒక బజాజ్ చేతక్, ఇస్తామన్నారట! అమ్మాయి ఎం.ఏ. చదివినందున వీళ్ళే వద్దనుకున్నారట. మరో సంబంధం, ఏకంగా రెండు లక్షల నగదుతో ఒక ఫ్లాటు, ఒక లక్ష ఇంటిసామాన్లు కూడా తీయిస్తామని వచ్చారట. అమ్మాయి నల్లగా ఉందని వీళ్ళుత్రోసి పుచ్చారట. ఏతావాతా ఈ సంభాషణల్లో వీళ్ళు తేల్చిందేమిటంటే, “ఒక లక్షకు తక్కువ గాకుండా మీరు ఇచ్చుకోగలిగితేనే తర్వాతి విషయాలు” అన్న గ్రహింపు కలిగించారనిపించింది.

నరసింహం మా ఇంటి విషయాలు, అవీ ఇవీ చెప్పుకొచ్చాడు. “ముందు అబ్బాయి వచ్చి అమ్మాయిని చూడనివ్వండి. మిగతా విషయాలు మళ్ళీ

మాట్లాడుకుందాం” అన్న అభిప్రాయాన్ని వాళ్ళకు చెప్పాడు. వాళ్ళు ఈ విషయాన్ని గడుసుగా తిప్పికొట్టారు. వాళ్ళ ధోరణి అంతా మీరెంతలో ఉన్నారో తేల్చండనే! నరసింహం బయటపడలేదు. “ముందు మీరు రండి” అన్నాడు. “మీ అడ్రసిచ్చి వెళ్ళండి. ఏ రోజు వచ్చేది ముందుగా ఉత్తరం రాస్తాం” అన్నాడు అబ్బాయి తండ్రి. భోజనాలయిం తర్వాత మేము బయలుదేరాం. అప్పటికి రెండు గంటలు దాటింది.

బస్సు బయలుదేరింతర్వాత, “ఈ సంబంధం మనకు కుదిరేది కాదు నరసింహం! వాళ్ళు చాలా ఖరీదుగా ఉన్నారు” అన్నాను నేను.

“అట్లా ఆలోచించవద్దు -- నువ్వు ఎక్కడికి వెళ్ళినా, ఇలాంటి పరిస్థితే ఎదురౌతుంది. డబ్బు గురించే గదా నీ చింత! మీ అమ్మాయి పెళ్ళికి తక్కువ పడినంత డబ్బు నేనే సమకూరుస్తాను. అయితే ఒక షరతు. మీఊళ్ళో ఉన్న నీ భూమిని అమ్మి డబ్బంతా నాకు ఇచ్చివేయాలి. నా బాకీ పోగా మిగిలిన మొత్తాన్ని మా కార్పొరేషన్‌లో వేస్తాను. మూడు సంవత్సరాల్లో రెట్టింపు చేసి మీ రెండో అమ్మాయి పెళ్ళి కూడా నేనే జరిపిస్తాను” అన్నాడు నరసింహం.

సమస్య ఇంత సులభంగా పరిష్కారమవుతుందని నేను అనుకోలేదు. అయినా భూమిని అమ్మేయడం మంచిదేనా? నరసింహం చెప్పిన పద్ధతిలో డబ్బును పెంచుకోవడం సరియైనదేనా? – ఇలా సాగుతున్నాయి నా ఆలోచనలు.

“అతిగా ఆలోచించి బుర్రపాడుచేసుకోవద్దు మూర్తీ! ముందు అమ్మాయి పెళ్ళి జరిగే మార్గం ఆలోచించు. ‘డబ్బు తేలేనట్టి నరునకు కీర్తి సంపదలబ్బవోయ్’ అని నువ్వు అభిమానించే మహాకవే అన్నాడు. డబ్బుతో డబ్బును సంపాదించడం నేటి కళ. మీ అబ్బాయిని నా కప్పజెప్పు. వాడిని నా కింద సంవత్సరం ఉండనీ, ఆ తర్వాత చూడు! నువ్వు నిటారుగా నడుస్తున్నంత కాలం లోకం నీకు తలక్రిందులుగా కనిపిస్తుంది. నువ్వు తలక్రిందులుగా నడు! లోకం నీకు నిటారుగా కనిపిస్తుంది” అంటూ హితబోధ చేస్తున్నాడు నరసింహం.

ఏదో ఇబ్బందిని అనుభవిస్తూన్నట్లుగా మౌనంగా ఉండిపోయాను నేను.

**❖ “సరికొత్తకథ” సంకలనం నుండి 1995**